


గిరిజనులకు రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలో గత్తుం పంచాయతీ వెలగాపడు గ్రామంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. గ్రామ ప్రజలు ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాస్టర్ కె యోహాను.రవి పాల్గొని దైవ సందేశాన్ని అందించారు. ఏసు క్రీస్తు ప్రభువు చూపించిన మార్గంలో నడవాలన్నారు. అనంతరం గ్రామంలో 15 కుటుంబాలకు రగ్గులు పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ప్రకాష్, రామారావు, మల్లన్న, సోమరాజు, దేవిడ్, ప్రసాద్ పాల్గొన్నారు.



రగ్గులు ఇస్తున్న దైవ సేవకులు



కొయ్యూరులో మౌన దీక్ష

పట్టు విడువక..


-18వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె -మంత్రి అమర్‌నాథ్, వైవి.సుబ్బారెడ్డిలను అడ్డగింత -అరకులోయలో భారీ ర్యాలీ



అరకులోయలో చేపట్టిన భారీ ర్యాలీ

ప్రజాశక్తి - విలేకర్ల యంత్రాంగం

సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపడుతున్న సమ్మె శుక్రవారం 18వ రోజుకు చేరింది. సమ్మె శిబిరాల్లో అంగన్‌వాడీలు ఆందోళనలు చేపట్టారు. సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు.



హుకుంపేటలో సమస్యలు విన్నవిస్తున్న అంగన్‌వాడీలు

అరకులోయ రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు శుక్రవారం మద్దతు తెలిపిన ఆదివాసీ గిరిజన సంఘం, సిఐటియు, ఎస్ఎఫ్ఐ వివిధ ప్రజా సంఘాలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుండి ఎంపిడిఓ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు.అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర మాట్లాడుతూ, అంగన్వాడీలకు ధైర్యంగా పోరాడాలని, మీ వెంట ప్రజా సంఘాలు అండగా ఉంటాయని భరోసా కల్పించారు.రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల, కష్టజీవులు పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తుందన్నారు. జగన్ ఇచ్చిన మాట నిల బెట్టుకోవాలని, లేకుంటే ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు దురియ నాగమ్మ, హాస్టల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు పాడి కొండలరావు, ఐటిడి వర్కర్స్ యూనియన్, అధ్యక్షులు దాడి రాజు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఏసుబాబు, కాఫీ రైతు సంఘం జిల్లా కన్వీనర్ సుంకరమెట్ట సర్పంచ్ గేమిలి చినబాబు, జిసిసి సోప్ యూనిట్ అధ్యక్షులు సింహాద్రి, ఆశ వర్కర్స్ యూనియన్ కన్నమ్మ, ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు బుజ్జిబాబు, నిర్మల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: అంగన్వాడీల సమ్మె 18వ రోజుకు చేరుకుంది. అంగన్ వాడీ వర్కర్లు, హెల్పర్ యూనియన్ నాయకులు మావుల్లమ్మ, సుజాత మాట్లాడుతూ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలు నెరవేర్చి సమస్యలను పరిష్కారం చేయాలన్నారు. లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షులు పి.ఈశ్వరరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు సత్యవతి, కాంతమ్మ, పార్వతి, నిర్మలమ్మ, భవాని, దేవి తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు సిపిఎం మద్దతు

అనంతగిరి: అంగన్వాడీల సమ్మెకు స్థానిక సిపిఎం జెడ్పిటిసి దీసరి గంగరాజు మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 18 రోజుల నుంచి నిరసన కార్యక్రమాలను ఉద్యమం చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెను ఉద్యమం చేపడతామని ఆయన స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో మండల యూనియన్ ప్రతినిధులు సిఐటియు కళావతి, పి.మంజుల, చిలకమ్మ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

మంత్రి, వైవీని అడ్డగింత

హుకుంపేట: మండలంలోని పీఎంఆర్‌సీ వద్ద సీఐటీయూ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా మంత్రి అమర్‌నాథ్, వైసీపీ ఉత్తరాంధ్ర కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిలను అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు రూ.26 వేల వేతనం, రూ.5 లక్షల బీమా, జీతంతో సగం పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. అంగన్వాడీ జిల్లా నేతలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, కృష్ణవేణి, వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావుల ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో భాగ్య, పద్మ, పూర్ణిమా, సుజాత, రాజేశ్వరి, అప్పలకొండమ్మ, ఈశ్వరమ్మ, వసంత, పుష్పవతి, రాధిక, నారాయణమ్మ, సన్యాసమ్మ పాల్గొన్నారు.

వైవిని అడ్డగించిన అంగన్వాడీలు

పాడేరు: హుకుంపేటలో శుక్రవారం నిర్వహించిన సాధికార బస్సు యాత్రలో పాల్గొనేందుకు వస్తున్న వైయస్సార్సీపి ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవి .సుబ్బారెడ్డి వాహనాన్ని అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు శుక్రవారం పాడేరులో అడ్డగించారు. పాడేరులోని అంగన్వాడి దీక్షా శిబిరం ఎదురుగా రోడ్డుపై అంగన్వాడీ కార్యకర్తలు బైఠాయించి నినదించారు. ఈ క్రమంలో పోలీసులతో అంగన్వాడీల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం వాహనం దిగి వచ్చిన సుబ్బారెడ్డి అంగన్వాడి వర్కర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం పరిధిలో అంగన్వాడి వర్కర్ల సమస్యలపై చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. తాను కూడా అంగన్వాడి వర్కర్ల సమస్యలపై ప్రభుత్వానికి నివేదిస్తానని, త్వరలో ప్రభుత్వం అంగన్వాడి ల సమస్యల్ని పరిష్కరిస్తుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగ్యలక్ష్మి చిన్నారి, ఇంద్ర, జయ, విజయ, లక్ష్మి కొండమ్మ, సత్యవతి పాల్గొన్నారు.

వరి గడ్డి తింటూ నిరసన

చింతపల్లి: మండలంలో అంగన్వాడీలు నోట్లో వరి గడ్డి వేసుకొని నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, కొన్ని జిల్లాల్లో వాలంటీర్లు ఇప్పటికే పోరాటం చేస్తున్నారని కలిసికట్టుగా చేయాలన్నారు. అంగన్వాడీలు, ఆశ, సిహెచ్‌డబ్ల్యూ, మున్సిపల్, కార్మికులు పోరాటం చేస్తున్నారని, ప్రభుత్వం పట్టు విడుపులకు పోకుండా దిగివచ్చి సమస్యలు పరిష్కారం చేయడానికి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు పెంటమ్మ, రాములమ్మ, లక్ష్మి, ప్రసన్న, సత్యవతి పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండల కేంద్రంలో అంగన్వాడీలు దీక్షా శిబిరం వద్ద కళ్ళకు గంతలు కట్టుకొని వినూత్న నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె విరమించేది లేదని నినాదాలు చేశారు. అంగన్వాడి యూనియన్ నాయకులు మోదకొండమ్మ, వరహాలమ్మ, వెంకటలక్ష్మి, సింహాచలం, కాంతమ్మ, రాజేశ్వరి, సత్యవతి పాల్గొన్నారు.

రంపచోడవరం: ని అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు చేస్తున్న సమ్మె 18వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలో నిరాహార దీక్షలో భాగంగా శనివారం ఆవుకు వినతిపత్రం సమర్పించారు. అంగన్వాడీల దీక్షకు టిడిపి మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు మద్దతు తెలిపారు. ప్రభుత్వం దిగివచ్చి అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను నెరవార్చాలని వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు కె.రామలక్ష్మి, సింగరమ్మ, సత్యవతి, టిడిపి నాయకులు అనంత మోహన్, సిద్దా వెంకన్న దొర, అంగన్వాడీలు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేంత వరకు తమ దీక్షలు కొనసాగుతాయని సిఐటియు రంపచోడవరం జిల్లా కార్యదర్శి బీ నిర్మల కుమారి, ఉపాధ్యక్షురాలు కే రాణి స్పష్టం చేశారు. మండల కేంద్రంలో 18 రోజులుగా అంగన్వాడీలు చేస్తున్న దీక్షలకు సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ, మినీ అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

కొయ్యూరు : మండల కేంద్రంలో అంగన్వాడీల సమ్మెలో భాగంగా స్టీలు కంచాలు మోగిస్తూ, నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. జీతాలు పెంచాలని మౌన దీక్ష చేపట్టారు. తమ న్యాయమైన కోర్కెలు తీర్చేంతకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి నాయకురాలు అచ్చయ్య, ముత్యాలమ్మ,అంగన్వాడీలు పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన ఆందోళన 18వ రోజుకు చేరింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎల్ సత్యవతి, జి దయ, వెంకటి, యశోద, చిరంజీవి, మేరీ, భవాని, భోదేశ్వరి, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ, అంగన్వాడి వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సంఘీభావం

చింతూరు : తమ సమస్యలను పరిష్కారం చేయాలని చింతూరు మండల కేంద్రంలో అంగన్వాడి కార్మికులు చేస్తున్న ఆందోళన 18వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా శనివారం ఆందోళన శిబిరాన్ని ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన ఆశా కార్యకర్తలు సందర్శించి సంఘీభావం తెలిపారు. అంగన్వాడీల సమస్యలను, ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు వీరమ్మ, ముత్తమ్మ, లక్ష్మి, అనిత, జయ, కాంతమ్మ పాల్గొన్నారు.



చింతపల్లిలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నయ్యపడాల్



చెక్కును విడుదల చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

జగనన్న విద్యా దీవెన నిధులు విడుదల

-జిల్లాలో విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ

ప్రజాశక్తి-పాడేరు: జగనన్న విద్యా దీవెన కింద జిల్లాలో 11,622 మంది విద్యార్థులకు చెందిన రూ.5,65,09,829లు సంబంధిత విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ అయ్యాయి. 2022 – 23 ఏడాది నాల్గవ విడత జగనన్న విద్యా దీవెన ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన రెడ్డి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరెట్ మినీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు బాగా చదువు కోవాలన్నారు. ఏ సమస్యనైనా అధిగమించాలంటే విద్యతోనే సాధ్యమన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని గుర్తించిన ప్రభుత్వం బిడ్డ పుట్టిన దగ్గర నుండి విదేశీ విద్య వరకు వివిధ పథకాలు అందజేయడం ప్రధాన ఆశయమన్నారు. విద్యకు పేదరికం అడ్డుకాకూడదన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల విద్యపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. జిల్లాలో 390 మంది ఎస్‌సి విద్యార్థులకు రూ.28,27,919లు, 9,669 మంది ఎస్‌టి విద్యార్థులకు రూ. 4,40,04,610లు, 1,173 మంది బిసి విద్యార్థులకు రూ.71,70,505, 108 మంది ఇబిసి విద్యార్థులకు రూ.8,32,914, 233 మంది కాపు విద్యార్థులకు రూ.12,82,502 మంజూరు అయ్యాయని తెలిపారు. 39 మంది ముస్లిం మైనారిటీ విద్యార్థులకు రూ.2,64,254, 10 మంది క్రిస్టియన్ మైనారిటీ విద్యార్థులకు రూ.1,27,125 జమ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి. అంబేద్కర్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి జనార్దనరావు, చింతలవీధి ఎంపిటిసి, సర్పంచ్, తదితరులు పాల్గొన్నారు.

పివిటిజిలకు పథకాలు అందించాలి : పిఒ

ప్రజాశక్తి-పాడేరు: ప్రధాన మంత్రి జన జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పిఎం జన్మన్) పథకం ఫలాలను పివిటిజి గిరిజనులకు అందించాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని ఐటిడిఏ పిఒ వి.అభిషేక్ స్పష్టం చేసారు. శుక్రవారం స్పందన అనంతరం ఐటిడిఏ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో పిఎం జన్ మన్ పథకం అమలుపై సమావేశం నిర్వహించారు. పి.ఎం. జన్‌మన్ పథకంపై అధికారులకు అవగాహన కల్పించారు. పివిటిజి గ్రామాలలో కనీస మౌలిక సదుపాయాలు, తాగునీటి సౌకర్యాలు, విద్యుత్తు, వైద్య సేవలు, టెలికం సేవలు, విద్యా సదుపాయాలు, పోషకాహారం వంటి వసతులు సమకూర్చడానికి కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోందన్నారు. అర్హత కలిగిన పివిటిజిలకు ఆయుష్మాన్ భారత్ కార్డులు, పక్కా గృహాలు, జన్ ధన్ బ్యాంకు ఖాతాలు, ప్రతీ కుటుంబానికి పూర్తి స్థాయిలో ఆధార్ కార్డులు, ఎస్టీ కుల ధృవీకరణ పత్రాలు, అటవీ హక్కు పత్రాలు మంజూరు చేయడానికి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి, డిఆర్ఓ .వివి రమణ, ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిఒ అభిషేక్



డైరీ, కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ డైరీ, కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- రంపచోడవరం

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ముద్రించిన కొత్త సంవత్సర డైరీ, కేలండర్‌ను స్థానిక యుటిఎఫ్ హోంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు వై విల్సన్‌బాబు, విశ్వరాజుల ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రంపచోడవరం అధ్యక్షులు సిహెచ్‌ఆర్ సనాతన బాబు, ప్రధాన కార్యదర్శి ఎన్ వెంగళరావు, కె.సూరిబాబు, కోశాధికారి లింగన్న, పి.రాజు, పకీర్ దొర, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వైద్య విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి -చింతూరు

మండల కేంద్రంలోని నిమ్మలగూడెం గ్రామంలో ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ ఆయుర్వేద ప్రాంగణంలో పారంపర్య వైద్య మహా సంఘం, జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు నిర్వహించిన వైద్య విజ్ఞాన సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల నుండి తరలివచ్చిన వందలాదిమంది ఆయుర్వేద వైద్యులను ఘనంగా సన్మానించారు. జమాల్‌ఖాన్ పులి వాయిల్ కషాయాన్ని తయారు చేసే విధానాన్ని ఆయుర్వేద వైద్యులకు ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. అనంతరం ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా మోటు తాలూకాలోని ఇస్మాల్ నగర్‌లో జమాల్ ఖాన్ ఫామ్ హౌస్‌కు ఆయుర్వేద వైద్య బందం తరలి వెళ్ళింది. అక్కడున్న ఔషధ మొక్కలను, వాటి వినియోగం, ఔషధాలు తయారు చేసే విధానం తదితర విషయాలను జమాల్ ఖాన్ తెలియజేశారు. ఎర్ర చిత్రమలం, పిప్పళ్ళు, నేలతాడి, అశ్వగంధ, ఎర్రఉల్లి, అతి మధురం, రణపాల, అర్జున చెట్టు, గోరింటా, గడ్డి చామంతి, అడవి పసుపు, తామర తీగ వేర్లు, తాని కాయలు, కరక్కాయలు వివిధ రకాల మొక్కల వేర్లు వాటి వినియోగం, శాస్త్రీయ నామాలు తదితర అంశాలను జమాల్ ఖాన్ వివరించారు. కార్యక్రమంలో ఇండియన్ ఫార్మసీ రిటైర్డ్ చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్ జకోటియా, నెల్లూరు నాటు వైద్యులు ఆనందయ్య, పారంపర్య వైద్య మహా సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్ రాజు, వేణుగోపాల్ రెడ్డి, జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి ఇమ్రాన్ ఖాన్, ఇన్చార్జి సయ్యద్ సుభాని, షేక్ సుభాని, మీడియా ప్రతినిధి కర్ర అనిల్ రెడ్డి పాల్గొన్నారు.



వనమూలిక కషాయం తయారీ విధానాన్ని తెలుపుతున్న జమాల్ ఖాన్

పోడు పట్టాలివ్వాలని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి- అరకులోయ రూరల్

గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాల మంజూరులో ఫారెస్ట్ అధికారులు ఆటంకాలు చేయరాదని శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో అరకువేలి అటవీ అధికారి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం అటవీ శాఖ అధికారి శ్రీనివాసరావు వినతి పత్రం అందజేశారు. సిపిఎం మండల కార్యదర్శి, కె.సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు మాట్లాడుతూ, మండలంలోని 14 పంచాయితీ పరిధిలోని 11వ డిఎల్సిలో సుమారు 644 మంది లబ్ధిదారులకు అర్హత జాబితాలో పేర్లు ఉన్నాయని, ఫారెస్ట్ అధికారులు వివిధ కారణాలతో అభ్యంతరం తెలపడం సరికాదన్నారు. పోడు వ్యవసాయంపై ఆధారపడి అనేక గిరిజనులు జీవిస్తున్నారని చెప్పారు. పలు దఫాలుగా దరఖాస్తులు పెట్టినా అటవీ శాఖ అధికారులు ఆటంకం పరుస్తున్నారని విమర్శించారు.అనేక సార్లు అధికారులు సర్వేలు చేసినా పట్టాలు రైతులకు ఎందుకు మంజూరు చేయలేదని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఆదివాసి గిరిజనులకు పోడు పట్టాలు మంజూరు కాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన అటవీ పాలసీ చట్టం అమలు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అందుకే పట్టాలులో వివిధ కారణాలు చూపుతోందన్నారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ చైర్మన్, గ్రామ సభ, పీసా కమిటీకి ఎటువంటి సంబంధం లేకుండా అటవీ సంపద కార్పొరేట్ కంపెనీలకు దారాదత్తం చేసేందుకు కేంద్రం పూనుకుంటుందన్నారు. దరఖాస్తు పెట్టుకున్న ప్రతి ఒక్క రైతుకు పోడు పట్టలు మంజూరు చేయాలని, లేకుంటే భవిష్యత్తులో పోరాటం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు గత్తుం బుజ్జిబాబు, సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు, పి.నాని బాబు, సిహెచ్ గురుమూర్తి, కె బుజ్జి బాబు, గిరిజన సంఘం నాయకులు కె.చిట్టిబాబు, సిహెచ్ కృష్ణకుమార్, విజయ్, సింహాచలం, నర్సమ్మ ,తదితరులు పాల్గొన్నారు.



అటవీశాఖ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న బాధిత గిరిజనులు, సిపిఎం నాయకులు

పేదలందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి -హుకుంపేట

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరికీ చేరువైన ప్రజల ఉనికిని తెలుసుకునేందుకు సాధికార బస్సు యాత్రను ఏర్పాటు చేయడం జరిగిందని ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని పెట్రోల్ బంకు వద్ద సామాజిక సాధికార బస్సు యాత్ర సభను శుక్రవారం ఏర్పాటు చేశారు. సాధికార బస్సు యాత్రలో ముఖ్యఅతిథిగా ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, నవరత్నాల చైర్మన్ నారాయణమూర్తి, ఎమ్మెల్సీ కుంభ రవిబాబు, అరకు ఎంపీ గొడ్డెట్టి మాధవి, రాష్ట్ర ట్రైకర్ చైర్మన్ శతక బుల్లి బాబు, ఎమ్మెల్సీ కుంభ రవిబాబు, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర పాల్గొన్నారు. ముందుగా వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటాన్ని పూలమాల వేసి సభను ప్రారంభించారు. సభ అధ్యక్షులు స్థానిక అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో నిర్వహించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశం ఉద్దేశించి ప్రభుత్వ విప్పు ధర్మశ్రీ మాట్లాడుతూ, గడపగడపకు వెళ్లి దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్క లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు, అవినీతి రహిత పరిపాలన జగన్మోహన్ రెడ్డి అందిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాన్ని అందించాలని ముఖ్య ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో గడపగడపకు వైద్య సిబ్బందిని పంపించి వివిధ రకముల వైద్య సేవలను అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే ఫాల్గుణ, వైసిపి రీజినల్ కో-ఆర్డినేటర్ సుబ్బారెడ్డి



డెమో ఇవిఎంలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

ఇవిఎంలపై ప్రజలకు అవగాహన

రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

ప్రజాశక్తి రంపచోడవరం

రంపచోడవరం నియోజకవర్గంలో ఓటర్ గుర్తింపు కార్డులున్న వారందరికీ ఇవియంలపై అవగాహన కల్పించే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఈవీఎంలపై అవగాహన కొరకు ఏర్పాటు చేసిన డెమో ఈవీఎంలను సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మండల కేంద్రాలు, ముఖ్యమైన ప్రాంతాల్లో ఇవిఎంలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ఈవీఎంలపై పూర్తిగా అవగాహన కలిగి ఉంటే వచ్చే ఎన్నికల్లో నిర్భయంగా ఓటర్లు ఓటు వేయవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ పివివి.జయకుమార్, డిప్యూటీ తాసిల్దారులు ఎన్‌వి సత్యనారాయణ, బి.రాజు, సీనియర్ అసిస్టెంట్లు టి.లక్ష్మణ్, డి.ఇందిరా బాయ్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-చింతూరు

మండలంలోని తుమ్మల గ్రామ పంచాయితీ పరిధి గంగనామెట్ట, లచ్చిగూడెం, తుమ్మల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎంపీటీసీ వేక రాజ్ కుమార్, సర్పంచ్ కొవ్వశి రామారావు, ఉయిక సుబమ్మ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులందరూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలు చేయాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎక్కువగా ఏర్పాటు చేయాలని, తడిచిన ధాన్యాన్ని సైతం రైతుల వద్ద నుండి కొనుగోలు చేయాలని, ఏ ఒక్క రైతుకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌బిఐ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంఎఏ శ్రీనివాస్, విహెచ్‌ఒ అభిరామ్, విఆర్‌ఒ ముచ్చిక సింగయ్య, స్థానికులు కుంజా లల్లయ్య, కుంజా వీరయ్య, ఆర్‌బికే సిబ్బంది పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపిటిసి రాజుకుమార్ తదితరులు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: సమ్మెను చేపడుతున్న అంగన్వాడి కార్మికులు, ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టి ఎన్‌టియుసి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం.స్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గత ఎన్నికల ముందు పాదయాత్రలో సీఎం ఇచ్చిన హామీలను అమలు పరచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మూడు వారాల నుంచి విధులు బహిష్కరించి సమ్మె చేపడుతున్నా ఇప్పటివరకు ప్రభుత్వం సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. కార్మికులు, ఉద్యోగులతో చర్చలు జరిపి తక్షణమే వారి సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మాస్కుల పంపిణీ

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పాడేరు బ్రాంచ్ విస్తృత సేవలు అందిస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు గ్రామాలలో పేదలకు బలికలకు కావడంలో దుప్పట్లు, దోమతెరలు, స్త్రీలకు హైజానిక్ కిట్లు, పాఠశాలలలో విద్యార్థులకు మాస్కులు పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని తలారిసింగి ఇంగ్లీష్ మీడియం బాలికల పాఠశాలలో విద్యార్థులకు మాస్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ వి.లోహిత్, సభ్యులు సూర్యారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గంగాభవాని, రెడ్ క్రాస్ సిబ్బంది చిన్ని తదితరులు పాల్గొన్నారు.

కెజిబివిని సందర్శించిన సంయుక్త కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: హుకుంపేట కెజిబివి పాఠశాలను సంయుక్త కలెక్టర్ కె.కార్తిక్ శుక్రవారం మొట్ట మొదటిసారిగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో పలు విషయాలు చర్చించారు. నాడు- నేడు కింద జరిగిన అభివృద్ధిని జిల్లా విద్యాశాఖాధికారి గౌరీ శంకర్ జేసికి వివరించారు. మౌలిక సదుపాయాలపై ఆరా తీసిన జేసి విద్యార్థులకు క్రమ శిక్షణతో కూడిన విద్యను అందించాలన్నారు.

ఆడుదాం- ఆంధ్రా పోటీలు

ప్రజాశక్తి - పాడేరు: రాష్ట్ర క్రీడా ప్రాధికారిక సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ హెచ్ఎం ధ్యాన్ చంద్ర శుక్రవారం పాడేరు జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న ఆడుదాం - ఆంధ్ర క్రీడా పోటీలను తిలకించారు. విశాఖపట్నం నుండి పాడేరు చేరుకున్న ధ్యాన్ చంద్రను జేసి కార్తిక్ స్వాగతం పలికి క్రీడా మైదానానికి తీసుకు వెళ్లారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఎండి మాట్లాడుతూ, క్రీడాకారులు ఓడిపోయినా బాధ పడకుండా క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలని సూచించారు.

గృహాల మంజూరుకు సర్వే

ప్రజాశక్తి -హుకుంపేట: ఆదిమ జాతి పివిటిజి లకు పక్క గృహములు మంజూరు చేయుటకు గాను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో, తహసిల్దార్ వెంకటరావు, రాళ్ళపల్లి హౌసింగ్ ఏఈ శంకర్రావు సమీక్ష చేశారు. గృహాల మంజూరుకు ఇంజనీరింగ్ సహాయకులకు సర్వే పూర్తి బాధ్యతలు అప్పగించారు. జనవరి 4 నాటికి పూర్తి చేయాలని అధికారులు తెలిపారు. ఫీల్డ్ సర్వే పూర్తి అయిన వెంటనే అర్హులైన పివిటిజిలకు ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

'బస్సు యాత్రలతో ఒరిగిందేమీ లేదు'

ప్రజాశక్తి- హుకుంపేట:సామాజిక సాధికార బస్సు యాత్రతో ఆదివాసీ సమాజానికి ఒరిగేది ఏమీ లేదని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కె.రామారావు, టి కృష్ణారావు అన్నారు. శుక్రవారం గిరిజన సంఘం మండల కమిటీ పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు.గిరిజన సమస్యలను పక్కన పెట్టి సభలు, యాత్రలతో కాలం గడుపుతున్నారన్నారు. గిరిజనులు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

2, 9 తేదీల్లో తారుమారు సంత

ప్రజాశక్తి -జి.మాడుగుల: వచ్చే నెల సంక్రాంతి పండుగ సందర్భంగా ఎన్నో ఏళ్ల తరబడి ఆనవాయితీగా వస్తున్న తారుమారు సంత జి మాడుగుల మండల కేంద్రంలో 2వ 9వ తేదీన జరుపనున్నట్లు స్థానిక సర్పంచ్ రాంబాబు మత్స్య రాస నాగరాజు స్థానిక విలేకరులకు తెలిపారు. వారు మాట్లాడుతూ, క్రీస్తుశకం మత్స్యరాస వెంకటరాజు హూట్ వద్ద సంత నిర్వహించడం జరుగుతుందన్నారు.

స్పందనకు 76 వినతులు

ప్రజాశక్తి-పాడేరు: సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం- స్పందనకు 76 ఫిర్యాదులు అందాయి. జాయింట్ కలెక్టర్ కె. కార్తీక్, ఐటిడిఏ పిఓ వి. అభిషేక్, సబ్‌కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి సంయుక్తంగా వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించి సంబంధిత అధికారులకు అందజేసి త్వరతిగతిన పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసారు. చింతపల్లి మండలం అంజలి శనివారం పంచాయతీ పాలమామిడి గ్రామస్తులు సి.హెచ్. వెంకటరావు, ఎస్.కామేశ్వరరావు తదితరులు మాడెంబంధ గ్రామం నుండి పాలమామిడి గ్రామం వరకు రోడ్డు నిర్మించాలని వినతి పత్రం సమర్పించారు. పాడేరు మండలం పాత పాడేరు జగనన్న గృహ కల్ప లేఅవుట్లో రహదారి, విద్యుత్తు, తాగునీటి సదుపాయాలు కల్పించాలని పల్టాసింగ్ లక్ష్మి, కె. రాములమ్మ తదితరులు వినతిపత్రం అందజేసారు.డుంబ్రిగుడ మండలం రంగిలిసింగి పంచాయతీ కుడబీర్ గ్రామస్తులు గ్రామంలో బోర్వెల్ పాడైపోయి తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని మరమ్మతులు చేయాలని కె.రాము, కిల్లో మల్లేశ్వరరావు అర్జీపత్రంలో కోరారు. పాడేరు మండలం కుజ్జలి గ్రామస్తులు టి. ఈశ్వరమ్మ, కిల్లో సత్యవతి, టి. మణి, చింతపల్లి మండలం చౌడుపల్లి పంచాయతీ గెర్రలగెడ్డ గ్రామస్తుడు కొర్రా మల్లేశ్వరరావు ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాలు కోసం దరఖాస్తులు చేసారు. పాడేరు మండలం మినుములూరు సర్పంచ్ లంకెల చిట్టెమ్మ మినుములూరు నుండి సంగోడి వరకు ఉపాధిహామీ పథకంలో రోడ్డు నిర్మించాలని మినుములూరు గ్రామంలో అసంపూర్తిగా ఉన్న జల్ జీవన్ తాగునీటి పథకాన్ని పూర్తి చేయాలని వినతి పత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ వి.వి. రమణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వి. వి. ఎస్. శర్మ, పి.మురళీ కృష్ణ, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండలరావు, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ డి.వి.ఆర్.ఎం. రాజు, డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్.కుమార్, ఇఇ బాల సుందర బాబు తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న అధికారులు

నేరాలు ఘోరాలు

20 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని రాజేంద్రపాలెం గ్రామ శివారులో గురువారం పోలీసులు దాడి చేసి 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాజారావు తెలిపారు. తమకు ముందుగా అందిన సమాచారం మేరకు, తమ సిబ్బంది, దాడి చేసి, 400 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామని, 20 లీటర్ల నాటుసారాతో దిబ్బ లక్ష్మి అనే మహిళను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. ఆమె వద్ద నుంచి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, సదరు మహిళను అరెస్టు చేసి, కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఎవరైనా నాటుసారా తయారీ, క్రయ విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



నాటుసారా, నిందితునితో పోలీసులు

విద్యుత్ అంతరాయంతో అవస్థలు

ప్రజాశక్తి-హుకుంపేట:సాధికార బస్సు యాత్ర సందర్భంగా మండల కేంద్రంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఏడు గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. బస్ యాత్రకు అడ్డుగా ఉన్నాయని విద్యుత్ తీగలను కట్ చేశారు. దీంతో, విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో, వ్యాపారాలు సాగలేదు.

పంచ గ్రామాల సమస్యపై ధర్నా

ప్రజాశక్తి-సింహాచలం: 24 సంవత్సరాల నుంచి సాగుతున్న పంచ గ్రామాల భూ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యాన సింహాచలం ప్రధాన కూడలి వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం రాస్తారకో జరిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ, ఈ సమస్య పరిష్కారానికి కేబినెట్లో ఆమోదం తెలిపి, గత ప్రభుత్వం మాదిరిగా ఆదరాబాదరాగా జిఒను తెచ్చి తర్వాత సమస్యను పక్కదారి పట్టించారని విమర్శించారు. ఈ సమస్య వల్ల సుమారు లక్ష మంది జనాభా బాధపడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించుకుంటే రానున్న ఎన్నికల్లో బాధితులు తరపున ఒక అభ్యర్థిని పోటీలో నిలుపుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

జివిఎంసి 72వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, ఈ సమస్యపై జివిఎంసి కౌన్సిల్లో తీర్మానం ప్రవేశపెడితే మేయర్ దీన్ని తిరస్కరించడం శోచనీయమన్నారు. దీన్ని చూస్తే ప్రభుత్వ పెద్దలు ఏ విధంగా మేనేజ్ చేస్తున్నారో అర్థమవుతుందన్నారు. వెంటనే రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం కార్యదర్శి టీవీ.కృష్ణంరాజు, సిహెచ్ఎస్ గోపాలకృష్ణ, ఎబిఎన్.ప్రతాప్, సిపిఎం గోపాలపట్నం జోన్ కార్యదర్శి బి.వెంకటరావు, సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం సభ్యులు పి.రామారావు, సిహెచ్ కోటేశ్వరరావు, ఎస్‌వి.రమణ, ఎం.రామభద్రరావు, నాగేశ్వరరావు, వి.నారాయణరావు, కృష్ణారావు, బి.శంకరరావు, శ్రీనివాసరావు, శ్రీహరి, కాలనీ సంఘాల పెద్దలు, బాధితులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పోరాటాలతోనే హక్కుల పరిరక్షణ



మహాసభలో మాట్లాడుతున్న టాన్యా

ప్రజాశక్తి-రంపచోడవరం : పోరాటాల ద్వారానే హక్కులను సాధించుకోవడం, వాటిని పరిరక్షించుకోవడం జరుగుతుందని అఖిల భారత రైతు కూలీ సంఘం జాతీయ అధ్యక్షులు పి.టాన్యా అన్నారు. సంఘం రంపచోడవరం డివిజన్ 18వ మహాసభ స్థానిక మార్క్స్ ఎంగెల్స్ భవనంలో శనివారం జరిగింది. ముందుగా సంఘం జెండాను ఆవిష్కరించి, అమరులను స్మరించుకుంటూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న టాన్యా మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడం లేదన్నారు. రేషన్‌కార్డుదారులకు బియ్యం ఇతర సరుకులు రద్దు చేశారని పేర్కొన్నారు. అటవీ ప్రాంతంలోని భూములను సర్వే చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం రంపచోడవరం డివిజన్ అధ్యక్షుడిగా గంగల బాలుదొర, ప్రధాన కార్యదర్శిగా పి.లచ్చిరెడ్డి 13 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి కె.దూలన్న, అధ్యక్షుడు వి.చిట్టిబాబు, కె.లక్ష్మి, ఐ.రమణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -కొయ్యూరు

మండలంలోని మర్రిపాలెం వద్దనున్న ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నాయకులు గౌతమ్, మను, రమణ, ఆనంద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి కళాశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో నెలకొన్న సమస్యలను వచ్చేనెల పదో తేదీలోగా పరిష్కరించాలని కోరారు.



విద్యార్థులతో మాట్లా డి సమస్యలనడిగి తెలుసుకుంటున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బిఆర్‌టిఎస్ బాధితులకు టిడిఆర్ చెక్కులు అందజేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-సింహాచలం: అడవివరం నుంచి సింహాచలం వరకు బిఆర్‌టిఎస్ రోడ్డు విస్తరణ పనుల పేరుతో రోడ్డుకిరువైపులా ఇళ్లను కోల్పోతున్న బాధితులకు టిడిఆర్ చెక్కులను అందజేయాలని సిపిఎం గోపాలపట్నం డివిజన్ కార్యదర్శి బి.వెంకటరావు డిమాండ్‌చేశారు. విస్తరణలో నష్టపోయిన వారికి ఇంతవరకు ఎటువంటి పరిహారమూ చెల్లించకుండా కాలయాపన చేయడాన్ని ఖండించారు. బిఆర్‌టిఎస్ బాధితులకు వారం రోజుల్లోనే టిడిఆర్ నష్టపరిహారాలు చెల్లిస్తామని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు హామీ ఇచ్చి రెండు నెలలు గడుస్తున్నా ఇంతవరకు టిడిఆర్ చెక్కులు ఇవ్వకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. బాధితులకు వెంటనే టిడిఆర్ చెక్కులు ఇవ్వకపోతే సిపిఎం పోరాటానికి దిగుతుందని హెచ్చరించారు.



మాట్లాడుతున్న మేయర్ గొలగాని హరివెంకట కుమారి

మౌలిక వసతులు, అభివృద్ధే లక్ష్యం - జివిఎంసి మేయర్, కమిషనర్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'జివిఎంసి పరిధిలో సమ్మె చేపట్టిన కార్మికుల డిమాండ్లు చాలా విలువైనవి, అందరం గౌరవించాల్సినవి, వీటి పరిష్కారానికి తగిన కృషిని చేస్తున్నాను, ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేసే ప్రయత్నాలు చేస్తున్నాం' అని జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ స్పష్టం చేశారు. మౌలిక వసతుల కల్పన, అభివృద్ధే ధ్యేయం అని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం జివిఎంసిలో ఏర్పాటు చేసిన 2023కి వీడ్కోలు, 2024కు స్వాగతం కార్యక్రమంలో వారిరువురూ మాట్లాడారు. తొలుత కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి మాట్లాడుతూ నగరంలోని 97 వార్డుల కార్పొరేటర్లతో కలసి విశాఖ నగర అభివృద్ధికి పనిచేస్తామన్నారు. 2023లో సాధించిన ప్రగతిని, లక్ష్యాలను మననం చేసుకుంటూ లోపాలను సవరించుకుని 2024లో మరింత నూతనోత్సాహంతో విశాఖ నగర సమగ్రాభివృద్ధికి కృషిచేస్తానన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో 2023-24 సంవత్సరంలో రూ.205 కోట్ల 5 లక్షల రూపాయల అంచనాలతో 967 పనులు చేపట్టగా 332 పనులను రూ.70 కోట్ల 4 లక్షలతో పూర్తి చేశామన్నారు. మిగిలిన పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. వార్డుల అభివృద్ధి ప్రణాళికలో 98 వార్డులకుగానూ 938 పనులను రూ.148.11 కోట్ల అంచనాలతో చేపట్టగా 577 పనులు పూర్తయ్యాయన్నారు. నాడు - నేడు స్కూల్స్ అభివృద్ధిలో తొలి దశ 59 పాఠశాలలను రూ.20 కోట్లా 77 లక్షలతో పూర్తి చేయగా, రెండో దశలో 87 పాఠశాలలకు రూ.34.79 కోట్లు ప్రతిపాదనలు చేసి పనుల పూర్తికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పార్కుల అభివృద్ధి, వీధి దీపాలు, అమృత్ పథకం, భూగర్భ మురుగునీటి పారుదల, ప్రజారోగ్యం, ఎకో వైజాగ్ అభివృద్ధి, యుసిడి, స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ, జగనన్న కాలనీలు, జగనన్న తోడు, వైఎస్సార్ ఆసరా, పట్టణ ప్రణాళికా విభాగం, ఆర్థిక విభాగం, విద్య, జగనన్న విద్యా కానుక, క్రీడలు విభాగం, ఆడుదాం, ఆంధ్రా వంటి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామన్నారు.

మున్సిపల్ విధులకు ఆటంకపరిస్తే చర్యలు

ప్రజాశక్తి - విశాఖపట్నం : మున్సిపల్ కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టామని, ఎవరైనా ఆటంకపరిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. 'క్లాప్ డ్రైవర్లు, పబ్లిక్ హెల్త్ వర్కర్లు శనివారం ఉదయం 5.30కి విధుల్లో ఉండాలి. పనులకు రాని వారికి నో వర్క్ నో పే అమలు చేస్తాం. పారిశుధ్య పనులను సచివాలయ సిబ్బంది చూడాలి. పనులను ఎవరైనా అడ్డుకుంటే చర్యలు తీసుకోవాలి' అని ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు 'ప్రపంచీకరణ- ఉపాధి'పై జాతీయ సెమినార్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సిఐటియు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన నండూరు ప్రసాదరావు స్మారకోపన్యాసంలో భాగంగా 'ప్రపంచీకరణ-ఉపాధి' అన్న అంశంపై శనివారం ఉదయం 10 గంటలకు విశాఖ డాబాగార్డెన్స్ సమీపంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జాతీయ సెమినార్ నిర్వహించనున్నట్లు సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్ తెలిపారు. ఈ సెమినార్‌కు జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ ప్రొఫెసర్, ప్రముఖ ఆర్థికవేత్త ప్రభాత్ పట్నాయిక్ ముఖ్య వక్తగా హాజరవుతారని పేర్కొన్నారు. ఆయనతో పాటు సిఐటియు అఖిలభారత కార్యదర్శి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ ప్రసంగిస్తారని తెలిపారు.

సిట్టింగ్‌లకు సీట్ల భయం

కొత్తవాళ్ల కోసం వైసిపి అన్వేషణ
గెలిస్తే గౌరవం దక్కుతుందని బుజ్జగింపు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

రాబోయే ఎన్నికల్లో కొన్ని నియోజకవర్గ సీట్లను కొత్త వారికి ఇవ్వాలన్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆలోచనతో సిట్టింగ్‌లకు ముచ్చెమటలు పడుతున్నాయి. సిట్టింగ్ స్థానం కోల్పోకుండా చేస్తున్న కసరత్తులో కొన్ని చోట్ల కొత్త ముఖాలు రానున్నాయి. ఏయే సీట్లలో కొత్తవారిని పెట్టాలనుకుంటున్నదీ ఇప్పటికే సూచనప్రాయంగా ఆయా ఎమ్మెల్యేలకు తెలియజేసినట్లు తెలిసింది. తమ పదవీకాలంలో చేసిన సేవలను వివరించి ఈసారికి మరో అవకాశమివ్వాలని కోరినా అందుకు జగన్ అంగీకరించలేదని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఒకసారి సిఎం నిర్ణయం తీసుకున్నాక అందులో మార్పు వుండదని తెలిసిన ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ ఇబ్బందులను చెప్పడానికి కూడా వెనుకాడుతున్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే నియోజకవర్గంలో కొత్తవారి విజయానికి మనస్ఫూర్తిగా కృషిచేసిన సిట్టింగ్‌లకు మంచి గౌరవం దక్కుతుందని భరోసా ఇచ్చినా, సీటు వదులుకోవడానికి ఎవరూ సుముఖంగాలేరు. పార్టీ అధికారంలోకి రాకపోతే తమ పరిస్థితి ఏంటన్న ప్రశ్నలు వారి నుంచి వ్యక్తమవుతున్నాయి. వచ్చే ఎన్నికల్లో కొత్త వారిని పెడతామని కొద్ది రోజుల క్రితం పాయకరావుపేట ఎమ్మెల్యే బాబూరావుకు పార్టీ నాయకులు తెలిపారు. కొంతకాలంగా నియోజకవర్గంలో పార్టీ నాయకుల మధ్య తలెత్తిన విభేదాలు రోజురోజుకూ పెరగడంతో బాబూరావును మార్చాలన్న యోచనలో పార్టీ నాయకత్వం వుంది. ఆయనకు టిక్కెట్ ఇచ్చినా నియోజకవర్గ నాయకులు పనిచేసే అవకాశం లేకపోవడంతో కొత్త వారిని పెట్టడానికి వైసిపి అధిష్టానం సిద్ధపడింది. దీంతో ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ అమ్మాజీ, గత ఎన్నికల్లో టిడిపి నుంచి పోటీచేసి ఓటమిపాలైన డాక్టర్ బంగారయ్య సహా పలువురు పాయకరావుపేట సీటు దక్కించుకోవడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. బాబూరావుకు రాజ్యసభ సీటు ఇస్తారని ప్రచారం జరుగుతున్నా అందుకు సిఎం సానుకూలంగా లేరని తెలుస్తోంది. ఎన్నికల వరకూ ఆయన సేవలను పార్టీ ఉపయోగించుకోవాలని చేస్తున్న ఎత్తుగడ తప్ప రాజ్యసభ సీటు ఇవ్వడానికి కాదన్న వాదన ఆ పార్టీ వర్గాల నుంచి వినిపిస్తోంది.

పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజుకు. అనకాపల్లి నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్‌కు, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి వచ్చేసారి సీటు దక్కే అవకాశం లేదన్న ప్రచారం సాగుతోంది. యలమంచిలి ఎమ్మెల్యే యువి.రమణమూర్తిరాజు పట్ల సిఎం అసంతృప్తితో వున్నట్లు తెలిసింది. తన తనయుడు వర్మకు టిక్కెట్ ఇవ్వాలని ఆయన కోరుతున్నా అందుకు ససేమిరా అన్నట్లు సమాచారం. తప్పనిసరి పరిస్థితుల్లో వచ్చే ఎన్నికల్లో రమణమూర్తిరాజుకు టిక్కెట్ ఇవ్వాలన్న యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్‌కు టిక్కెట్ ఇచ్చే విషయంలో కూడా ఆలోచిస్తున్నట్లు సమాచారం. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు అయ్యన్నపాత్రుడుకు ధీటైన వ్యక్తిని పోటీలో వుంచాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. మాడుగుల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు వరకు టిక్కెట్ విషయంలో గ్యారంటీవున్నా, మిగిలిన నియోజకవర్గాల్లో ఆచీతూచీ సీట్లు కేటాయించాలని చూస్తోంది.

పథకాల అమలుకు ప్రత్యేకాధికారులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సంక్షేమ పథకాల అమలుపై పర్యవేక్షణ, మరింత పటిష్టంగా అమలు చేసే నిమిత్తం ఆయా మండలాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు వివరాలను వెల్లడిస్తూ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేలా చర్యలు చేపట్టాలని, ఆయా సచివాలయాల పరిధిలో క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని, అవగాహన సదస్సులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్ష, వైఎస్సార్ పింఛను కానుక, చేయూత, ఆసరా తదితర కార్యక్రమాల నిర్వహణ, అమలుపై సచివాలయ సిబ్బందితో స్థానికంగా సమావేశాలు నిర్వహించాలని, ప్రభుత్వ విధానాలను తెలపాలని సూచించారు. ఎప్పటికప్పుడు ప్రగతి నివేదికలను అందజేయాలని ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలోని 11 మండలాలకు వివిధ శాఖల ఉన్నతాధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వీరే మండలాల ప్రత్యేక అధికారులు

పద్మనాభం - జి.సూర్యప్రకాశరావు (జిల్లా పౌర సరఫరాల అధికారి), భీమునిపట్నం ఎస్.భాస్కర రెడ్డి (ఆర్డీవో, భీమిలి), ఆనందపురం - టి.సీతారామ్మూర్తి (ప్రత్యేక ఉప కలెక్టర్), విశాఖపట్నం రూరల్ (జివిఎస్ఎస్ రామమోహన్ రావు (ప్రత్యేక ఉప కలెక్టర్), సీతమ్మధార - చక్రవర్తి (డిపిఒ, జివిఎంసి), మహారాణిపేట - చంద్రిక (డిపిఒ, జివిఎంసి), గోపాలపట్నం పి.శేషశైలజ (ప్రత్యేక ఉప కలెక్టర్), ములగాడ టి.ప్రవీణ (జిల్లా కో-ఆపరేటివ్ అధికారి), గాజువాక - డి.లక్ష్మారెడ్డి (ఎస్టేట్ అధికారి, విఎంఆర్‌డిఎ) పెదగంట్యాడ - వి. సన్యాసిరావు (అడిషనల్ కమిషనర్,జివిఎంసి), పెందుర్తి డి.హుస్సేన్ సాహెబ్ (ఆర్డీవో, విశాఖపట్నం)

భూ హక్కు చట్టం రద్దు చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కోర్టు ఇన్ గేటు వద్ద బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమం 11వ రోజైన శుక్రవారమూ కొనసాగింది. విశాఖ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, ప్రధాన కార్యదర్శి పైలా శ్రీనివాసరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ భూహక్కు చట్టం అమలులోకి వస్తే భూమికి సంబంధించిన వివాదాల్లో న్యాయస్థానాల ప్రమేయం ఉండదన్నారు. ఇది రాజ్యాంగ వ్యతిరేకం కనుక ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కు తీసుకోవాలన్నారు. లేకుంటే రానున్న కాలంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



సమావేశంలో పాల్గొన్న స్థాయి సంఘ సభ్యులు, అధికారులు

జివిఎంసి స్థాయి సంఘంలో 55 అంశాలు ఆమోదం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

52 మెయిన్ అజెండాలతో పాటు టేబుల్ అజెండాలు 3 మొత్తంగా 55 అంశాలను శుక్రవారం ఉదయం జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఏకగ్రీవంగా సభ్యులంతా ఆమోదించారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి సుమారు రూ.256 కోట్లు అభివృద్ధి పనులకు, ప్రజా ఆరోగ్య విభాగానికి సంబంధించి, అదనపు కార్మికులను తాత్కాలికంగా సేవలు వినియోగించుకునేందుకు రూ.142.72 కోట్లు బడ్జెట్ ఆమోదించారు. అలాగే రెవెన్యూ విభాగానికి సంబంధించి లీజులు పొడిగింపు మొదలైన అంశాలతో కలిపి 55 అంశాలను ఆమోదించారు. జోన్ల వారీగా లీజుల వివరాలను స్టాండింగ్ కమిటీలో సభ్యులకు వారి వారి వార్డులు, జోన్ల వారీగా అధికారులు సమర్పించాలని కార్పొరేటర్ ఉరుకూటి నారాయణ రావు సమావేశంలో కోరారు. దీనికి రెవెన్యూ విభాగపు అధికారి ఫణిరాం జోన్ల వారీగా లీజుల వివరాలను అందజేస్తానన్నారు.

పాములు పట్టే వారి నియామకం చేయాలి

సిఎంఒ నరేష్‌కుమార్ మాట్లాడుతూ నగర పరిధిలోగల 8 జోన్ల పరిధి, శివార్లలో పాముల బెడద ఉందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పాములు పట్టేవారిని నియమించుకోవాలని స్థాయి సంఘ సమావేశంలో ప్రతిపాదన పెట్టారు. రొక్కం కిరణ్‌కుమార్ ఈ స్నేక్ సేవర్ సొసైటీ విశాఖపట్నంకు అధ్యక్షులుగా ఉన్నారని, ఎలాంటి వేతనం తీసుకోకుండా ఆయన పనిచేస్తున్నారని వివరించారు. ఆయన శిక్షణ ఇచ్చిన పది మందిని నియమించుకుంటే ఒక్కొక్కరికీ నెలకి రూ.10 వేలు చొప్పున వేతనం చెల్లించాలని ప్రతిపాదిస్తున్నానని, 2024 జనవరి 1 నుంచి 2024 జూన్ 30 వరకూ మొత్తంగా ప్రతి నెలా రూ.4.80 లక్షలు రొక్కం కిరణ్‌కుమార్ టీంకు చెల్లించేందుకు స్టాండింగ్ కమిటీ ఆమోదించాలని చీఫ్ మెడికల్ ఆఫీసర్ నరేష్ కుమార్ ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది.

ప్రజా ఉద్యమాల ఫలం.. కాకూడదు ప్రైవేట్‌పరం - మాజీ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రజా ఉద్యమాల ఫలితంగా 1971లో విశాఖ ఉక్కు ప్రారంభమైందని, కేంద్ర ప్రభుత్వం నేడు ఎన్నో విధాలుగా బలహీనపరిచి ఒక ప్రైవేట్ సంస్థకు తక్కువ ధరకు అమ్మే దిశగా చేపట్టిన వ్యూహాలపై స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాలని మాజీ ఐఎఎస్ అధికారి ఇఎఎస్ శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 'కర్మాగారానికి కావాల్సిన సుమారు 20 వేల ఎకరాలను అప్పటి భూ సేకరణ చట్టం కింద రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రభుత్వ రంగ పరిశ్రమకు రైతుల నుంచి తీసుకుని ఇచ్చింది. అటువంటి పరిశ్రమను ప్రయివేట్ సంస్థకు ఇవ్వడం చట్టవిరుద్ధమే అవుతుంది. భూములు నాడు కోల్పోయిన రైతులకు ద్రోహం చేయడమే ఇది. చట్టాన్ని గౌరవించకుండా కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టాలనుకోవడం సమర్థనీయం కాదు. ఉక్కుకు సొంత గనులను కేటాయించకపోవడం దారుణం. కేంద్రం ఉద్దేశపూర్వకంగా వ్యవహరిస్తోంది. దేశంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఉక్కు కర్మాగారాల్లో సొంత ఇనుప గని లేనిది ఒక్క విశాఖ ఉక్కే. ఎన్ని విజ్ఞప్తులు చేసినా పాలకులు పట్టించుకోవడం లేదు. ప్రైవేట్ సంస్థలకు విచ్చలవిడిగా ఇనుప గనులను కేంద్ర ఖనిజ మంత్రిత్వ శాఖ ఇచ్చేస్తోంది. విశాఖ ఉక్కు అమ్మకంలో ప్రైవేట్ సంస్థలు కాకుండా సెయిల్ పాల్గొంటే విశాఖ ఉక్కుకు నిజమైన విలువ వచ్చేది. కారుచౌకగా ఉక్కును కొన్ని సంస్థలకు ఇచ్చేసే కుట్రను కేంద్ర ప్రభుత్వం చేయడం సరైనది కాదు. ప్రజాప్రతినిధులు పార్లమెంట్, రాష్ట్ర అసెంబ్లీల్లో పార్టీలకు అతీతంగా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలన్న డిమాండ్ చేయాల్సి ఉంది. లేదంటే ఈ రాజకీయ నాయకులకు ప్రజా క్షేత్రంలో భవిష్యత్ ఉండదని హెచ్చరిస్తున్నాను' అని తెలిపారు.